ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
సోమవారం 25 ఆగస్టు 2025



ఓట్ చోరీతోనే బండి సంజయ్ గెలుపు

- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 100 సీట్లు
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్



మధురానగర్‌లో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్

7

నాయకా..! వినాయకా..!!

- గణేశ్ ఉత్సవాలకు సిద్ధమవుతున్న భక్తులు
- స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఆశావహులకు ముందస్తు ఖర్చు
- పెరిగిన ధరలతో భక్తులకు తప్పని అధిక భారం



జిల్లా కేంద్రంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ఆది దేవుడిగా కొలిచే గణనాథుల ఉత్సవాలకు భక్తులు సిద్ధమవుతున్నారు. వినాయక నవరాత్రుల కోసం యువజన సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలకోసం రాజన్న సిరిసిల్ల జిల్లాలో విగ్రహాల తయారీ కూడా ముగిసింది. అమ్మకాల కోసం భారీవిగ్రహాలు కొలువుదీరాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పల్లెల్లో వినాయక ఉత్సవాలతోనే రాజకీయ మద్దతును ప్రాబల్యాన్ని పెంచుకోవడానికి స్థానికసంస్థల్లో పోటీచేయడానికి సిద్ధపడ్డ ఆశావహులు తహతహలాడుతున్నారు. హైకోర్టు ఆదేశాలతో సెప్టెంబరు 30లోగా ఎన్నికలు జరిగే పరిస్థితులు ఏర్పడ్డ నేపథ్యంలో గ్రామాల్లో ఎన్నికల సందడి మొదలైంది. ఆశావహుల ఉత్సాహాన్ని వినాయక ఉత్సవ నిర్వాహకులు సైతం ఉపయోగించుకుంటున్నారు. జిల్లాలో 260 గ్రామపంచాయతీలు, 2,268 వార్డులు ఉన్నాయి. సర్పంచుల నుంచి మొదలుకొని వార్డు సభ్యులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ, మున్సిపల్ కౌన్సిలర్ స్థానాలపై కన్నేసిన వివిధ పార్టీల నాయకులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రాజకీయ ఎదుగుదల వ్యూహరచనలో యువతను ఆకట్టుకోవడానికి సిద్ధమయ్యారు. వినాయక ఉత్సవాలకు అవసరమయ్యే విగ్రహాలు, ఏర్పాట్లకు సంబంధించి ఉచితంగానే అందజేస్తున్నారు. గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఓటరు జాబితా సిద్ధమవుతున్న క్రమంలో ఎన్నికలు కూడా దసరా వరకు నిర్వహించే అవకాశం ఉంది. ఈక్రమంలో యువజన సంఘాలు ఆశావహుల నుంచి ఆశిస్తున్న వినాయక విగ్రహాలు, మండపాలు, సౌండ్‌సిస్టమ్ వంటివి సమకూర్చుకుంటే దూరమవుతామనే భావనతో ఆశావహులు కూడా కాదనలేకపోతున్నట్లు చర్చించుకుంటున్నారు. కొందరు ఆశావహులు ముందస్తు ఖర్చు చూసి కొంత ఇబ్బంది పడుతున్నా తప్పని పరిస్థితిగానే మారిపోయింది. ఉత్సవాలకు ఖర్చు చేస్తున్నా నాయకులు మాత్రం ఫ్లెక్సీల ఏర్పాటుతో పాటు మైకుల్లో తమను ప్రమోట్ చేస్తూ ప్రచారం చేయాలని ఒప్పందం చేసుకుంటున్నట్లుగా తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో నిర్వాహకులకు కొంత భారం తగ్గినట్లుగానే భావిస్తున్నారు.

● ధరల మోత...

తొలిపూజను అందుకునే గణేష్ ఉత్సవాల సందడి రాజన్న సిరిసిల్లజిల్లాలో మొదలైంది. జిల్లా కేంద్రంలో చిన్నవిగ్రహాల నుంచి భారీ విగ్రహాలను తయారుచేసి అమ్మకాలకు ఉంచారు. మరోవైపు భారీ విగ్రహాలను ఇతర ప్రాంతాల నుంచి తీసుకువస్తున్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోనే భారీ సైజుల్లో ...

మిగతా 8లో

పదిశాతం యారన్ సబ్సిడీని అమలు చేయాలి

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం మహిళా పొదుపు సంఘాలకు అందించేందుకు తయారుచేయిస్తున్న ఇందిరా మహిళ శక్తి చీరలకు పది శాతం యారన్ సబ్సిడీని అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల బీవైనగర్‌లోని అమృత్ లాల్ శుక్లా కార్మిక భవనంలో అదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు వస్త్ర పరిశ్రమలకు సంబంధించి సమస్యలు కేటీఆర్ పెండింగ్‌లో పెట్టడం వల్ల జటిలంగా మారాయన్నారు. వర్కర్ టూ ఓనర్ పథకాన్ని ప్రారంభించి అపెరల్ పార్క్‌లో వీవింగ్ షెడ్‌లను పూర్తి చేసి మరమగ్గాలను వేయకుండా నిలిపివేయడం వల్ల కార్మికులకు అన్యాయం చేశారని మండిపడ్డారు. కొత్తగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వర్కర్ టూ ఓనర్‌పథకం కోసం షెడ్‌లను ఇతర అవసరాలకు ప్రభుత్వం వినియోగించుకుంటందన్నారు. మరమగ్గాల పరిశ్రమకు అదనంగా విధిస్తున్న బ్యాక్‌కరెంట్ బిల్లుల సమస్య వల్ల పరిశ్రమలన్నీ మూతపడుతున్నాయన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఈ సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తోందన్నారు. వర్కర్‌టూ ఓనర్ పథకాన్ని పూర్తి చేసి కార్మికులకు అందించడంతోపాటు కరెంట్ బ్యాక్ బిల్లింగ్ సమస్యలను పరిష్కరించాలన్నారు. మంత్రులు స్పందించి మరమగ్గాల వస్త్ర పరిశ్రమల సమస్యలను పరిష్కారించడంతో పాటు పదిశాతం యారన్ సబ్సిడీని అందించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కోడం రమణ, ఎగమంటి ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మీసేవా కేంద్రాల నిర్వహణకు రాత పరీక్షలు

- కలెక్టరేట్‌లో పరీక్షలను పర్యవేక్షించిన కలెక్టర్



పరీక్ష తీరును పర్యవేక్షిస్తున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పలు మీసేవా కేంద్రాల నిర్వహణ కోసం ఆదివారం రాత పరీక్షలను జిల్లా ఈ-గవర్నెన్స్ కమిటీ సభ్యులతో ఇంటర్వ్యూలు నిర్వహించారు. చందుర్తి మండలం మూడపల్లి, గంభీరావుపేట, తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల, వేములవాడ అర్బన్ మండలం తేట్టెకుంట, ముస్తాబాద్ మండలం చీకోడ్, రుద్రంగి మండలం మానాల, సిరిసిల్ల మున్సిపల్‌లో సుభాష్‌నగర్‌లో నూతన మీసేవా కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తులను స్వీకరించారు. 72 దరఖాస్తులు రాగా, ఆదివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అభ్య ర్థులకు రాత పరీక్షలు నిర్వహించారు. పరీక్షలను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పర్యవేక్షించారు. ఈ-గవర్నన్స్ కమిటీ సభ్యులు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

గురుకులంలో వసతులు కల్పించాలి

- ఇప్పల్లపల్లి చౌరస్తాలో విద్యార్థుల తల్లిదండ్రుల ధర్నా



ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో సరైన వసతులు లేకపోవడంతో విద్యార్థులు చదువుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని, కలెక్టర్ స్పందించి వసతులను కల్పించాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆదివారం రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. సిరిసిల్ల అర్బన్ పెద్దూర్ శివారులో ఇప్పల్లపల్లె చౌరస్తాలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే గురుకులంలో చదువుతున్న తమ పిల్లలను చూసుకునేందుకు ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి తల్లిదండ్రులు తరలివచ్చారు. అయితే గురుకులంలో వసతుల సక్రమంగా లేవని విద్యార్థులు తల్లిదండ్రులకు చెప్పడంతో ఆగ్రహించారు. ఇరుకుగా ఉన్న భవనంలో నుంచి హాస్టల్‌ను మరో భవనంలోకి మార్పులు చేయడంతో వసతులను కల్పించాలంటూ సిరిసిల్ల-కామారెడ్డి ప్రధానరోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ఈసందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ తంగళ్లపల్లి మండలం మండెపల్లి నుంచి హాస్టల్‌ను రెండు సంవత్సరాల క్రితం ఈ భవనంలోకి మార్చారన్నారు. సరైన గదులు లేకపోవడంతో ఒక్క గదిలోనే 70మంది విద్యార్థులను కూర్చోబెట్టడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, ఒక్క విద్యార్థికి జ్వరం వస్తే అది అందరికి వ్యాప్తిచెందుతుందన్నారు. కలెక్టర్ స్పందించి హాస్టల్‌ను మరో భవనంలోకి మార్చాలని కోరారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



బోనాలతో వెళుతున్న మహిళలు

కోనరావుపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం కొలనూరు గ్రామంలో గ్రామస్తులు పోచమ్మ బోనాల పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామస్తులు పోచమ్మ బోనాల సందర్భంగా మహిళలు బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య అమ్మవారి ఆలయానికి వెళ్లి మొక్కలు చెల్లించుకుని కుటుంబ సభ్యులు, పాడిపంటలు బాగుండాలని వేడుకున్నారు.

విద్యుత్ సంక్షోభానికి ప్రధాన కారకుడు కేటీఆర్

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ విద్యుత్ సంక్షోభానికి ప్రధాన కారకుడు కేటీఆర్ అని లాల్ బహుట చేనేత పవర్‌లూం కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పంతం రవి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తున్న సమయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కేటీఆర్ ఉత్తరం రాయడం ఒక డ్రామా అని ఆరోపించారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు సంబంధించిన విద్యుత్ బ్యాక్ బిల్లింగ్ విషయంపై జేఏసీ అభ్యర్థన మేరకు కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి చొరవతో చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వివరించారన్నారు. మూడు రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని హామీనిచ్చారని, ఈక్రమంలో ఆ క్రెడిట్ కొట్టేయాలనే దురుదేశంతో కేటీఆర్ భట్టికి లేఖ రాశారని ఆరోపించారు. నల్లచంద్రమౌళి, అజ్జ వేణు, సోమ నాగరాజు, కొంక విజయ్, ఎనగంటి రాజు పాల్గొన్నారు.

తెలంగాణ సారస్వత పరిషత్ శాశ్వత సభ్యుడిగా అశోక్



అశోక్

సిరిసిల్ల ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సారస్వత పరిషత్ శాశ్వత సభ్యుడిగా బాలసాహితీవేత్త గరిపల్లి అశోక్‌ను నియమించినట్లు పరిషత్ ఒక ప్రకటన జారీ చేసింది.జిల్లాలోని మల్లారెడ్డిపేటకు చెందిన అశోక్ బాల సాహిత్య వికాసం కోసం నాలుగు దశాబ్దల సాహి త్య సేవా సృజనకు పరిషత్ శాశ్వత సభ్యుడిగా గౌరవం లభించింది. గతంలో సిరిసిల్ల ప్రాంతం చెందిన జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డాక్టర్ సి నారాయణరెడ్డి శాశ్వత సభ్యుడిగా చివరి వరకు పరిషత్తు అధ్యక్షుడిగా ఉన్నారు. తర్వాత సిరిసిల్లకు చెందిన డాక్టర్ పత్తిపాక మోహన్ శాశ్వతసభ్యులుగా నియామకం కాగా, ఇప్పుడు గరిపెల్లి అశోక్ నియామకం కావడంపై పత్తిపాక ఫౌండేషన్,గరిపల్లిట్రస్టు, మారసం అభినందనలు తెలిపింది.

కలెక్టర్, ఎస్పీకి మట్టి గణపతుల అందజేత



కలెక్టర్‌కు మట్టి వినాయకుడి ప్రతిమను అందిస్తున్న శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ మహేష్‌బి గీతేకు ఆదివారం టీపీసీసీ కోఆర్డినేటర్ సంగీతం శ్రీని వాస్ మట్టి గణపతుల ప్రతిమలను అందజేశారు. తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యవేక్షణలో పర్యావరణ పరిరక్షణ కోసం ప్రత్యేకంగా తయారుచేసిన మట్టి గణపతి ప్రతిమల ను జిల్లాకు పంపించారు. జిల్లా అధికారులను కలిసి మట్టి గణపతి ప్రతిమలను సంగీతం శ్రీనివాస్ అందించారు.

రాజాబహదూర్ వెంకటరామారెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

8

కపట ప్రేమతో కేటీఆర్ ఉత్తరం..

- కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి

వేములవాడ రాజన్నపై ముఖ్యమంత్రికి ప్రత్యేక శ్రద్ధ

- ఇప్పటికే ఆలయ నిర్మాణానికి రూ.150 కోట్లు మంజూరు - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఆది శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయ అభివృద్ధిపైన సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక శ్రద్ధ ఉందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మూలవాగు బ్రిడ్జి నుంచి రాజన్న ఆలయం వరకు గల ప్రధాన రోడ్డు, డ్రైనేజీ, ఫుట్‌పాత్ నిర్మాణానికి రూ.6.50కోట్ల పనులకు ఆదివారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బీ గితేతో కిలిసి శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ పట్టణ వాసులతో పాటుగా రాష్ట్రం, ఇతర రాష్ట్రాల భక్తులు, ప్రజలు 54ఏళ్లుగా ఎదురు చూస్తున్న మూలవాగు నుంచి శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయం వరకు రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. 80ఫీట్ల వెడల్పుతో రోడ్డు నిర్మిస్తామని ఇచ్చిన హామీ అమలులోకి తీసుకువచ్చామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యం లో ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడగానే ఆలయ అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలు ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. ప్రభుత్వం ఏర్పడిన మొదటి మాసంలోనే వీటీడీఏ సమావేశం ఏర్పాటు చేసి మళ్లీ వెళ్లిపో యిన రూ.20 కోట్ల నిధులను తిరిగి తెప్పించి బద్ది పోచమ్మ ఆలయ అభివృద్ధి కార్యక్రమం ప్రారంభించామని గుర్తు చేశారు. రోడ్డు వెడల్పు సమయంలో కొందరు నాయకులు వచ్చి అటుఇటు నడిచి పనులు ఎప్పుడు ప్రారంభిస్తారో చెప్పాలని ప్రకటనలు చేశారని, ఏది ఎప్పుడు చేయాలో తమకు తెలుసని స్పష్టం చేశారు. ఒక ప్రణాళిక ప్రకారం ముందకు వెళ్తున్నామని వివరించారు. భూ నిర్వాసితుల కోసం రూ.47 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించి కలెక్టర్ ఖాతాలో జమ చేసి పనులు ప్రారంభం చేశామని తెలిపారు. రోడ్డు వెడల్పులో భూములు కోల్పోయిన నిర్వాసితుల త్యాగం వెలకట్టలేనిదని పేర్కొన్నారు. వారిని ఎల్లవేళలా గుర్తు చేసుకుంటూ వారికి 2013 భూసేకరణ చట్టం ద్వారా నష్టపరిహారం చెల్లించామని తెలిపారు. 2014లో రాజన్న ఆలయం ఎట్లా ఉందో ఇప్పటికి అలానే ఉందని, గత ప్రభుత్వం చేసింది ఏమిలేదన్నారు. కానీ ఎన్నికల్లో ఎలాంటి హామీ ఇవ్వకుండా ఇప్పటివరకు రూ.150కోట్లు కేటాయించామని వివరించారు. పట్టణం, రాజన్న ఆలయం రెండు కళ్లుగా భావించి అభివృద్ధి చేస్తామని, పట్టణాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. ఆలయాన్ని అభివృద్ధి పథంలో తీసుకోవానికి ప్రజాప్రభుత్వం రూ.150 కోట్లు బడ్జెట్‌లో కేటాయించామని తెలిపారు. రాజన్న ఆలయ అభివృద్ధి తన ఎజెండా కాదని, ఇది సమస్త రాజన్న భక్తుల ఎజెండా అని వివరించారు. గత సంవత్సరం నవంబరు 20న సీఎం రేవంత్‌రెడ్డి 8మంది మంత్రుల చేతుల మీదుగా రూ.1000కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామని గుర్తు చేశారు. రోడ్డుకు ఇరువైపులా డ్రెనేజీ నిర్మాణంతోపాటు ఆధునాతన పద్ధతుల్లో లైటింగ్ సిస్టం కూడా ఏర్పాటు చేస్తామని, జిల్లా యంత్రాంగం, కలెక్టర్ సందీప్‌కుమార్ నేతృత్వంలో అధికారయంత్రాంగం పనులను పర్యవేక్షిస్తున్నారన్నారు. త్వరలోనే రూ.76 కోట్లతో ఆలయ మొదటి దశ అభివృద్ధి పనులు ప్రారంభించనున్నామని, ఇప్పటికే అగ్రిమెంట్లు పూర్తి అయి నమూనాలు త్వరలోనే రానున్నాయని వెల్లడించారు. రూ.35 కోట్లతో అన్నదాన సత్రం నిర్మాణానికి టెండర్లు పూర్తయిందని, త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా, ఎస్పీ మహేష్ బీ గితే, ఈవో రాధాబాయి, కమిషనర్ అన్వేష్, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు రాజు, చెలుకల తిరుపతి, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

ముఖ్యమంత్రి, మంత్రివర్గం వల్లే యూరియా కష్టాలు..

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం రైతులు లైన్లో చెప్పులు పెట్టుకునే పరిస్థితులు ముఖ్యమంత్రి, మంత్రివర్గం వల్లే వచ్చాయని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఇష్టం వచ్చినట్లుగా కేటీఆర్‌పై మాట్లాడడాన్ని బీఆర్ఎస్ పక్షాన ఖండిస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రితో పనిచేస్తున్న వారందరు ఎలాంటి వారో ప్రజలందరికీ తెలుసని అన్నారు. రైతుబంధు రూ.15వేలు ఇస్తామని రూ.12వేలు ఇచ్చారని, కల్యాణ లక్ష్మీతో పాటు తులం బంగారం ఇస్తామన్నారు.. చదువుకొనే ఆడపిల్లలకు స్కూటీలు ఇస్తామని ముఖ్యమంత్రి మోసం చేశారన్నారు. రైతులకు సకాలంలో యూరియా, ఎరువులు ఇవ్వలేని దిక్కుమాలిన ప్రభుత్వం అని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా గోదావరి నీళ్లను, సమయానికి కరెంట్ ఇస్తూ, సకాలంలో ఎరువులు, యూరియా ఇచ్చి ధాన్యానికి మద్దతు ధరను చెల్లించి రైతుల ఖాతాల్లో డబ్బులు వేసింది కేసీఆర్ పాలనలోనేనన్నారు. అనేక హామీలను ఇచ్చి అడ్డదారిలో అధికారంలోకి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందని, పేదల ఇళ్లను కూలగొడుతున్నారని వారి ఆస్తులు, ప్రాణాలకు నష్టం చేకూర్చుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడచూసినా గురుకులాల్లో పురుగుల అన్నంతో కలుషితం అయిన ఆహారం తింటూ విద్యార్థులు ఆసుపత్రి పాలవుతున్నారని, విద్యా వ్యవస్థను గాడిలో ముఖ్యమంత్రి పెట్టలేకపోతున్నాడని ఆయన ఆరోపించారు.

ఈ సమావేశంలో బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, మాజీ ఎంపీపీ గజభీంకార్ రాజన్న, నాయకులు కుంభాల మల్లారెడ్డి, అందె సుభాష్, గడిల సురేష్, సురేష్‌నాయక్, గడ్డం భాస్కర్, బాలయ్య పాల్గొన్నారు.

యూరియాను సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలం

ఇల్లంతకుంట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రానికి రావలసిన యూరియాను సరఫరా చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం చెందిందని జిల్లా రైతుసంఘ అధ్యక్షుడు తీపిరెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతులు పంటలు సాగుచేస్తూ యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడటం దురదృష్టకరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. కొంతమంది వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నందున అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు ఆనంద్, సమ్మయ్య, రవీందర్, ఆశయ్య తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందుతాగి యువకుడి బలవన్మరణం


నవీన్(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగారం గ్రామానికి చెందిన రేకుల నవీన్(43) మద్యానికి బానిసై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నవీన్ భార్య సుజాత మద్యం తాగవద్దని ఎన్నిమార్లు చెప్పినా వినలేదు. ఈనెల 23న అతిగా మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో గొడవపడి మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు నవీన్‌ను కాల్వశ్రీరాంపూర్ ఆసుపత్రికి తీసుకువచ్చి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైనవైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య సుజాతతోపాటు ఒక కుమారుడు ఉన్నాడు. నవీన్ తల్లి సరోజ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

కమాన్‌పూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ములకలపల్లి గ్రామానికి చెందిన గాజుల రవీందర్ గౌడ్(30) ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. రవీందర్‌గౌడ్ పదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. సంవత్సర కాలంగా స్వగ్రామమైన ములకలపల్లిలో జీవనం సాగిస్తున్నాడు. అయితే ఆరు నెలలుగా భార్యభర్తల మధ్య నిత్యం గొడవలు జరుగుతున్నాయి. గొడవలతో విసిగిపోయిన రవీందర్ మనస్తాపంతో పురుగు మందు తాగాడు. దీనిని గమనించిన బంధువులు అతన్ని హుటాహుటిన పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండ్రి గాజుల వెంకటస్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

జ్యోతినగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్కాపూర్‌లో ఆదివారం రాత్రి కొంపెల్లి భీమమ్మ(65) అనే వృద్ధురాలు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. పని మనిషి ఇంటికి వచ్చిన సమయంలో వృద్ధురాలు ఆత్మహత్య చేసుకొన్న విషయాన్ని గుర్తించి చుట్టుపక్కల వారికి సమాచారం అందించింది. మృతురాలి బంధువులు అందుబాటులో లేరు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఎన్టీపీసీ పోలీసులు మృతదేహాన్ని గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

యువకుడి మృతదేహం లభ్యం


రామ్‌అనుజ్(ఫైల్)

ఓదెల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శానగొండ గ్రామపంచాయతీ అనుబంధ గ్రామం గొల్లపల్లి సమీపంలోని రైల్వేపట్టాల పక్కన సిమెంట్ కాలువలో ఆదివారం యూపీ రాష్ట్రం, సుల్తాన్పూర్ జిల్లాలోని సజ్వాన్ హరినాథ్‌పూర్‌కు చెందిన రామ్‌అనుజ్ యాదవ్(29) అనే యువకుడి మృతదేహం ఆదివారం లభ్యమైంది. మూడురోజుల క్రితం గుర్తుతెలియని ఎక్స్‌ప్రెస్‌రైలులో హిటార్చి నుంచి బెంగళూర్‌వైపు ప్రయాణిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు పడి మృతి చెంది ఉంటాడని జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. తీవ్రగాయాలతో మృతదేహం కుళ్లిపోయి ఉందని, మృతుడివద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా వివరాలు లభించాయని తెలిపారు. మృతుడి కుటుంబసభ్యులు, బంధువులకు సమాచారం అందజేసి మృతదేహాన్ని రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు.

గుండెపోటుతో న్యాయవాది మృతి

జమ్మికుంట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంటకు చెందిన సీనియర్ న్యాయవాది శేషాల సారంగం(66) ఆదివారం గుండెపోటుతో మృతిచెందాడు. కాంగ్రెస్‌పార్టీ బ్లాక్‌బి అధ్యక్షుడు మొలుగూరి సదయ్య పుష్పాంజలి ఘటించి భౌతికకాయానికి కాంగ్రెస్ పార్టీ కండువా వేశారు. ఆయనవెంట మాజీ కౌన్సిలర్ శ్రీపతి నరేష్, పొనగంటి రవీందర్ ఉన్నారు.

ప్రమాదకరంగా లక్ష్మీపూర్-వెల్ది రోడ్డు


లక్ష్మీపూర్‌లో కల్వర్టుకు ఏర్పడిన గొయ్యి

మానకొండూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని లక్ష్మీపూర్-వెల్ది గ్రామాల ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టుపై గొయ్యి ఏర్పడింది. ఈ ప్రదేశంలో గ్రామస్థులు మట్టిని పోసి కర్రలను పెట్టారు. ఈ రూట్‌లో నిత్యం ఆర్టీసీ బస్సు, ఇసుక ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు వెలుతుంటాయి. సింగిల్ రోడ్డు కావడంతో రాత్రివేళలో ఎదురెదురుగా వచ్చే వాహనాల వెలుతురుకు గొయ్యి కనబడడం లేదని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. గొయ్యిపడి సుమారు 20 రోజులు దాటినా మరమ్మతు చేపట్టకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.



విదేశాల్లో ఉన్నత విద్య కోసం 'విద్యానిధి'

● ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం అంబేద్కర్ ఓవర్సీస్

● బీసీ, ఈబీసీ విద్యార్థులకు మహాత్మా జ్యోతిబా ఓవర్సీస్ పథకం



చొప్పదండి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉన్నత విద్య చదవాలనుకునే ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ విద్యార్థులకు విద్యానిధి ఓవర్సీస్ పథకం వరంగా నిలుస్తున్నది. విదేశాల్లో విద్య ఖర్చుతో కూడుకున్నది కాగా పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన విద్యార్థులకు అందని ద్రాక్షగా మారేది. కాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి, మహాత్మా జ్యోతిబాఫూలే ఓవర్సీస్ విద్యానిధి పథకాలు విద్యార్థులకు వరంగా మారుతున్నాయి. పేద విద్యార్థుల కలను నెరవేర్చి విదేశాల్లో విద్యను చదివేందుకు ఆలంబనగా నిలుస్తున్నాయి.

అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి..

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు విదేశాల్లో విద్యనందించే అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం వరంగా మారింది. రూ.20లక్షల వరకు రాష్ట్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లను ఎంపికైన విద్యార్థులకు అందజేస్తుంది. దీంతోపాటు విమాన ఖర్చులు, వీసా ఖర్చులను భరిస్తుంది. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు యూఎస్‌ఏ, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్, యూకే, సింగపూర్, జపాన్, సౌత్‌కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో ఉన్నత విద్యనభ్యసించేందుకు అవకాశం కల్పిస్తున్నది. కుటుంబ వార్షిక ఆదాయం రూ.5లక్షల లోపు ఉండాల్సి ఉండగా కుటుంబంలోని ఒకే విద్యార్థికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. విద్యార్థులు గ్రాడ్యుయేషన్‌లో 60శాతం మార్కులు సాధించి ఉండాలి. ఎస్సీ విద్యార్థులు జీఆర్‌ఈ, జీమ్యాట్, ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ టెస్ట్‌లో అర్హత సాధించాలి. ఎస్టీ విద్యార్థులు జీఆర్‌ఈ, జీమ్యాట్, టోఫెల్, పీఈటీలో అర్హత సాధించాల్సి ఉంటుంది. కాగా ఈ నెల 31లోగా ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలి.

బీసీ విద్యార్థులకు మహాత్మా జ్యోతిబాఫూలే విద్యానిధి పథకం..

బీసీ, ఈబీసీ విద్యార్థులకు ఉన్నత విద్యనందించేందుకు మహాత్మా జ్యోతిబాఫూలే విద్యానిధి పథకం దోహదపడుతున్నది. ఈ పథకం కింద కూడా రూ.20 లక్షల వరకు స్కాలర్‌షిప్ అందజేస్తారు. విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.5లక్షలలోపు ఉండాలి. గ్రాడ్యుయేషన్‌లో 60శాతం మార్కులు సాధించి ఉండడంతోపాటు జీఆర్‌ఈ, జీమ్యాట్, టోఫెల్, ఐఇఎల్‌టీఎస్, పీటీఈలో అర్హత మార్కులకు ఆధారంగా ఎంపిక చేస్తారు. యూఎస్‌ఏ, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్, యూకే, సింగపూర్, జపాన్, సౌత్ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో ఉన్నత విద్యనభ్యసించేందుకు అవకాశం కల్పిస్తున్నది. ఈ పథకానికి కూడా ఈనెల 31 లోగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.

అన్నారం టు జగిత్యాల.. కలప అక్రమ రవాణా


అన్నారంలోని ఆలేటి చెరువు కట్టపై నిల్వ ఉంచిన కర్రలు

మానకొండూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారం గ్రామం నుంచి జగిత్యాల జిల్లాకు అక్రమ కలప రవాణా కొనసాగుతోంది. అన్నారం గ్రామంలోని మామిడితోటలు, తుమ్మ, వేపచెట్లను నరికివేస్తూ కలపను కరీంనగర్- జగిత్యాల జిల్లాలకు అక్రమంగా తరలిస్తున్నారు. అన్నారం ఆలేటి చెరువు కట్టపై కర్రలను నిల్వ చేసి లారీలు, వ్యానులలో కర్రలను పేర్చి అవి కనబడకుండా తాటిపత్రితో కట్టి రాత్రి వేళల్లో రవాణా చేస్తున్నారు. కలప అక్రమ రవాణా జరుగుతున్నా అటవీశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా మండలంలోని పచ్చునూర్, కెల్లేడు, రంగపేట, లక్ష్మీపూర్, వెల్ది, వేగురుపల్లి, రంగపేట, ఊటూర్, దేవంపల్లి, చెంజర్ల తదితర గ్రామాల్లో చెట్లను నరికివేస్తున్నా అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు ప్రతిరోజు పర్యవేక్షించి చెట్ల నరికివేతను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వ్యవసాయ బావిలో పడిన రెండేళ్ల బాలుడు

● గాలిస్తున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది


కౌశిక్ నంద(ఫైల్)

సైదాపూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయికల్ గ్రామానికి చెందిన చేరాల వెంకటయ్య-కావ్యల రెండేళ్ల కొడుకు ఆడు కుంటూ వెళ్లి వ్యవసాయ బావిలో పడిపోయాడు. వివరాల్లోకి వెళితే.. కావ్య కొడుకును తీసుకొని మధ్యాహ్నం సమయంలో వారి వ్యవసాయ క్షేత్రానికి వెళ్లింది. బాలుడిని ఒడ్డుపై ఉంచి వ్యవసాయ పనుల్లో నిమగ్నమైంది. ఇంతలో బాలుడు ఆడుకుంటూ వెళ్లి బావిలో పడిపోయాడు. బావిలో ఏదో పడిన శబ్దం విన్న కావ్య తలెత్తి చూసింది. ఒడ్డుపైన ఆడుకుంటున్న బాలుడు కనిపించలేదు. దీంతో కావ్య లబోదిబోమంటూ బాలుడి కోసం చూసింది. ఎక్కడా కనిపించకపోయే సరికి బాబే బావిలో పడ్డాడని భావించి చుట్టుపక్కల వారిని పిలిచింది. అక్కడికి చేరుకున్న సమీప పొలాల రైతులు, కూలీలు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనస్థలానికి చేరుకొని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు బాలుడి మృతదేహం వెలికితీసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. బావిలో నీరు ఎక్కువగా ఉండడం, బావి చుట్టూ పొదలు అల్లుకపోయి ఉండడంతో బాలుడి మృతదేహం వెలికితీతకు ఆలస్యం అవుతోందని పోలీసులు పేర్కొన్నారు. బావికి మోటార్లు పెట్టి నీటిని తోడుతున్నారు. రాత్రి వరకు బాలుడి మృతదేహం లభ్యం కాలేదు.

డాక్యుమెంటేషన్ వెరిఫికేషన్ పేరిట రూ.1.48లక్షల స్వాహా

కరీంనగర్ క్రైం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): డాక్యుమెంటేషన్ వెరిఫికేషన్ పేరిట సైబర్ నేరగాళ్లు ఓవిద్యార్థి నుంచి రూ.1.48 లక్షలు స్వాహా చేశారు. కరీంనగర్ త్రీ టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. కరీంనగర్ వావిలాలపల్లికి చెందిన బి శ్రీపీతం అనేవిద్యార్థి పైచదువుల కోసం వీసాకు దరఖాస్తు చేసుకున్నాడు. ఈనెల 8న ఇండియన్ ఎంబసీ పేరుతో శ్రీపీతంకు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్‌చేశాడు. డాక్యుమెంటేషన్ వెరిఫికేషన్ జరుగుతోందని, ఫీజు చెల్లించాలని పేర్కొన్నాడు. నాలుగు దఫాలుగా ఫోన్‌పే ద్వారా మొత్తం రూ.1,48,200 పంపించాడు. ఆ తరువాత గుర్తుతెలియని వ్యక్తికి ఫోన్‌చేయగా స్విచాఫ్ వచ్చింది. సైబర్ నేరగాళ్ల పనేనని గ్రహించి వెంటనే 1930 నంబరులో ఫిర్యాదు చేశాడు. దీనిపై కరీంనగర్ త్రీ టౌన్‌లో ఆదివారం ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

డీఎల్‌ఎడ్‌లో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

తిమ్మాపూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో డీఎల్‌ఎడ్ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్లకు మరోసారి స్పాట్ అడ్మిషన్లకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని మండలంలోని ఎల్ఎండీలో గల డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. డీసెట్ 2025ఉత్తీర్ణులై అర్హత, ఆసక్తి ఉండి ఇప్పటి వరకు ప్రవేశంపొందని అభ్యర్థులు డీసెట్2025 వెబ్‌సైట్‌ను పరిశీలించి తమ మాధ్యమంలో తమతమ కేటగిరి సీట్లుఖాళీగా ఉన్న కళాశాలలను తెలుసుకోవాలని అన్నారు. అన్నిఒరిజినల్ సర్టిఫికేట్లు తీసుకొని ఈనెల 26న ఉదయం 10గంటలకు ఎల్ఎండీ కాలనీలో గల ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థకురావాలని, 28న ప్రైవేటు కళాశాలకు ఉదయం 10గంటలకు వెళ్లి సీటు కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

సందడే.. సందడి..

● ఎగువ మానేరుకు భారీగా సందర్శకులు


ఎగువ మానేరు జలాశయం వద్ద భారీగా సందర్శకులు

గంభీరావుపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు జలాశయానికి ఆదివారం పర్యాటకులు భారీగా తరలివచ్చారు. ఆదివారం కావడంతో సందర్శకుల తాకిడి భారీగా కన్పించింది. మానేరు మత్తడి దూకడం తగ్గుముఖం పట్టినా ప్రాజెక్టు అందాలను చూసేందుకు పర్యాటకులు వస్తున్నారు. మానేరు మత్తడి దూకే ప్రాంతం సందర్శకులతో సందడి సందడిగా మారింది.

చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో కొండచిలువ


కొండచిలువతో అసిరి సుమన్

కరీంనగర్ క్రైం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని డీర్‌పార్క్ పక్కన ఉన్న చేపపిల్లల ఉత్పత్తికేంద్రం వద్ద ఆదివారం ఓ కొండచిలువ చేపలవలలో చిక్కుకొని కనిపించింది. దీంతో గమనించిన సిబ్బంది జంతుసంరక్షణశాలకు సమాచారం అందించారు. జంతుసంరక్షణశాల అధ్యక్షుడు అసిరి సుమన్ పటేల్ కొండచిలువను బయటకు తీసి అటవీప్రాంతంలో వదిలిపెట్టారు.

మారమ్మ తల్లికి మొక్కులు


దప్పువాయిద్యాలతో వెళ్తున్న గ్రామస్థులు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్, వేములకుర్తి గ్రామాల అభివృద్ధి కమిటీలు, కుల సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం మారమ్మతల్లి, గ్రామ దేవతలకు మొక్కులను చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన రహదారుల్లో అమ్మవారికి బోనం, చీరె, సార తదితర వస్త్రాలు, పూజసామగ్రిని ఎదుర్కొంటు వెళ్లారు. పలుచోట్ల పోత రాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పంటలు సమృద్ధిగా పండాలని, సీజన్లో వచ్చే అనారోగ్య సమస్యల నుంచి పిల్లాపాపలను చల్లగా చూడాలని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, మహిళలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని రక్షించిన లేక్ పోలీసులు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని మానేరు జలాశయంలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించిన వ్యక్తిని శనివారం అర్ధరాత్రి సమయంలో లేక్‌పోలీసులు కాపాడారు. లేక్ పోలీసుల వివరాల ప్రకారం... సిద్దిపేట జిల్లా కోహెడ మండలం ఎన్టీఆర్ కాలనీకి చెందిన వేల్పుల సంపత్(39) ప్రస్తుతం కరీంనగర్‌లోని కట్టరాంపూర్‌లో నివాసం ఉంటున్నాడు. కుటుంబసభ్యుల సమస్యలతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకునేందుకు మానేరుజలాశయం కట్టపైకి ఎక్కాడు. అక్కడ విధుల్లో ఉన్న లేక్ అవుట్‌పోస్ట్ హోంగార్డు శ్రీనివాస్ గమనించి అడ్డుకున్నాడు. అనంతరం సంపత్‌కు లేక్ అవుట్ పోస్ట్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. కుటుంబసభ్యులను పిలిపించిన అప్పగించారు. సమయానికి స్పందించి సంపత్ ప్రాణాలు కాపాడిన హోంగార్డు శ్రీనివాస్‌ను పోలీస్‌కమిషనర్ గౌస్‌ఆలం అభినందించారు.

రెండు ఇళ్లలో చోరీ

తిమ్మాపూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామంలో రెండు ఇళ్లలో చోరీ జరిగింది. ఎల్ఎండీ పోలీసులు తెలిపినవివరాల ప్రకారం.. లక్ష్మీదేవిపల్లి గ్రామంలో తాళాలు వేసిఉన్న కరివేద కరుణాకర్‌రెడ్డి, లెంకల రామచంద్రరెడ్డి ఇళ్లలో ఈనెల23 అర్ధరాత్రి దొంగలు పడ్డారు. రూ.5వేలు, 15తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ఎస్సారెస్పీకి తగ్గిన ఇన్‌ఫ్లో

● ఎనిమిది గేట్లు తెరిచి.. 24,640 క్యూసెక్కులు దిగువకు ● కాకతీయ కాలువ, వరద కాలువలకు కొనసాగుతున్న నీటి విడుదల


దిగువకు విడుదలవుతున్న శ్రీరాంసాగర్ నీరు

జగిత్యాల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఆదివారం ఇన్‌ఫ్లో తగ్గింది. ఎస్సారెస్పీ వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదల ఆదివారం కొనసాగింది. ఎనిమిది గేట్ల ద్వారా 24,640 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. కాగా ఎస్సారెస్పీలోకి 54,187 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటినిల్వ 80.5సామర్థ్యానికి ప్రస్తుతం 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వరదగేట్లు పైకి ఎత్తడం, కాకతీయ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరాలకు కలిపి ప్రాజెక్టు నుంచి 54,187క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో వరదకాలువకు 20,000క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 3,500క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 150క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 500క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతోంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్లను ఎత్తి గోదావరిలోకి నీటిని వదులుతున్నందున నదీ పరీవాహక ప్రాంతాల్లోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రధానంగా రైతులు, చేపలు పట్టేవారు, పశువుల కాపరులు నదిలోకి దిగవద్దని అధికారులు కోరుతున్నారు.

కొనసాగుతున్న ఎత్తిపోతలు..

ధర్మారం: గోదావరి జలాల ఎత్తిపోతలు 12రోజులుగా కొనసాగుతున్నాయి. ఈనెల 13 నుంచి మూడు పంపుల ద్వారా ఎత్తిపోతలు ప్రారంభించారు. అప్పటి నుంచి నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ఒక్కో రోజు రెండు, మూడు మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు. ఉదయం 7.30 నుంచి సాయంత్రం 5-30గంటల వరకు మొదట మోటార్లను రన్‌చేశారు. ప్రస్తుతం శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి భారీగా వరద నీరు ఎల్లపల్లి ప్రాజెక్టుకు వస్తుండడంతో నిర్విరామంగా ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. శనివారం రెండుమోటార్ల ద్వారా 6300క్యూసెక్కుల నీటిని ఎగువకు ఎత్తిపోయగా, ఆదివారం ఒక మోటారు ద్వారా 3150క్యూసెక్కుల నీటిని లక్ష్మీ పూర్‌లోని గాయత్రి పంప్‌హౌస్‌కు తరలిస్తు న్నారు.


గాయత్రి పంపుహౌస్ నుంచి విడుదలవుతున్న నీరు

ఎల్లంపల్లి నుంచి నీటి విడుదల..

పెద్దపల్లి: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి 89,138క్యూసెక్కుల వరదనీరు వస్తున్నది. 10 గేట్ల ద్వారా 70,248క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలి పెడుతున్నారు. అలాగే నంది పంపు హౌస్‌కు 3150క్యూసెక్కుల నీటిని తరలిస్తుండగా, అక్కడినుంచి గాయత్రి పంప్‌హౌస్ మీదుగా అంతేమొత్తంలో నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలకుగాను, 19.925టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

సుందిళ్ల బ్యారేజీలో పెరిగిన గోదావరి వరద..

మంథని రూరల్: మండలంలోని సిరిపురం వద్ద ఉన్న సుందిళ్ల బ్యారేజీలో ఆదివారం గోదావరి వరద పెరిగింది. ఎగువ ప్రాంతం నుంచి గోదావరిలోకి 73,994 క్యూసెకుల వరద నీరు బ్యారేజీ లోకి వస్తుండటంతో అధికారులు వరద నీటిని దిగువ ప్రాంతానికి వదులుతున్నారు. రెండు రోజుల క్రితం వర్షాలు తగ్గడంతో వరద నీరు తగ్గింది.

గాయత్రి నుంచి కొనసాగుతున్న నీటివిడుదల..

రామడుగు: రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంపుహౌస్ నుంచి నీటివిడుదల కొనసాగుతోంది. ప్రస్తుతం ఒక్క పంపు ద్వారా 3150క్యూసెక్కుల నీటిని అధికారులు గ్రావిటీ కెనాల్‌కు విడుదల చేశారు. అదినేరుగా వెళ్లి వరదకాలువలో కలుస్తోంది. ఎస్సారెస్పీ నుంచి 18,500క్యూసెక్కుల నీరు వరదకాలువలో 99వ కిలోమీటర్ల వద్ద కలుస్తోంది. దీంతో ప్రస్తుతం 21,650క్యూసెక్కుల నీరు చేరుతున్నది. అయితే మిడ్ మానేరుకు 21,650 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. వరదకాలువ నిండుకుండలా తయారై కొత్త ఒరవడిని సృష్టిస్తోంది.

అన్నపూర్ణలోకి కొనసాగుతున్న ఎత్తిపోతలు..

ఇల్లంతకుంట: ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటిఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5టీఎంసీ సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.45 టీఎంసీల నీరు ఉంది. మధ్యమానేరు ద్వారా 9600 క్యూసెక్కుల నీరు వస్తుండగా, ఎగువన ఉన్న 11వ ప్యాకేజీలోని రంగనాయకసాగర్‌కు 9900క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రస్తుతం మూడు పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో..

బోయినపల్లి: శ్రీరాజరాజేశ్వర జలాశయానికి ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి ద్వారా నీటిప్రవాహం కొనసాగుతోంది. ప్రాజెక్టులోకి శనివారం సాయంత్రంవరకు 18,218క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగు తోంది. ఇందులో ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 15,068, గాయత్రి పంప్‌హౌస్ నుంచి 31,150 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. కాగా మిడ్‌మానేరు ప్రాజెక్టు నుంచి ప్యాకేజి 10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 9600, ఎల్ఎండీ ప్రాజెక్టుకు ఆరు గేట్లను ఎత్తి 10వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318మీటర్లకు ప్రస్తుతం 313.77, నీటి నిలువ సామర్థ్యం 27.55 టీఎంసీలకు 17.897 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

9 టీఎంసీలకు చేరిన ఎల్ఎండీ రిజర్వాయర్

తిమ్మాపూర్: ఎగువ నుంచి, శ్రీరాజరాజేశ్వర రిజర్వాయర్(ఎంఎంఆర్) నుంచి వస్తున్న నీటి ఇన్‌ఫ్లోతో దిగువమానేరు జలాశయం 9.07 టీఎంసీలకు చేరింది. ఎల్ఎండీ పూర్తిస్థాయి నీటిమట్టం 24.034టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.977 టీఎంసీలు ఉంది. ఎంఎంఆర్ నుంచి 9489 క్యూసెక్కులు నీరు ఇన్‌ఫ్లో ఎల్ఎండీలోకి వస్తుండటంతో 229క్యూసెక్కుల నీరు మిషన్ భగీరథ, ఆవిరి రూపంలో వెళుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

ఓట్ చోరీతోనే బండి సంజయ్ గెలుపు


భారీ సంఖ్యలో పాల్గొన్న ప్రజలు

● వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వంద సీట్లు

● టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

కరీంనగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఓట్‌చోరీతోనే కరీంనగర్‌లో బండి సంజయ్‌కుమార్ గెలుపొందాడని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. ఆదివారం గంగాధర మండలంలో కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో కలిసి జనహిత పాదయాత్ర నిర్వహించారు. అనంతరం మధురానగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు దొంగోట్లతోనే గెలిచారన్న అనుమానాలు ఉన్నాయన్నారు. రాహుల్‌గాంధీ బయటపెట్టిన ఓటర్ జాబితా చూస్తే స్పష్టమవుతుందన్నారు. లక్షలకు పైగాదొంగ ఓట్లు చేర్చడం, ఒకే అడ్రస్‌పై వందల ఓట్లు, జీరో అడ్రస్‌లపై వేల ఓట్లు ఉన్నాయన్నారు. ఒకే ఎపిక్ నంబర్ పై వేర్వేరు రాష్ట్రాల్లో ఓట్లు ఉండటం ప్రజాస్వామ్యా నికి ప్రమాద మన్నారు.

ఎన్నికలు వస్తేనే బీజేపీకి దేవుళ్లు గుర్తుకువస్తారు..

ఎన్నికలు వస్తే బీజేపీకి దేవుళ్లు గుర్తుకు వస్తారని, దేవుళ్లను


కురిక్యాల నుంచి పాదయాత్రగా బయల్దేరి కార్యకర్తలకు అభివాదం చేస్తున్న పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు పొన్నం, అడ్లూరి, వివేక్

రాజకీయాల్లోకి లాగడం ఏంటన్నారు. రాముడి అక్షంతలను సైతం రాజకీయాలకు వాడుకుంటున్నారన్నారు. దేవుళ్ల పేరుతో కాంగ్రెస్ పార్టీ ఏనాడైనా ఓట్లు అడిగిందా అని ప్రశ్నించారు. కులం మతం లేక పోతే బీజేపీ గెలవలేదన్నారు. దేవుడి పేరుతో ఓట్లు అడిగే బిచ్చగాళ్లని, కొండగట్టు అంజన్న పేరుతో బీజేపీ నేతలు ఓట్లు అడుగుతున్నారన్నారు. ఎన్నికలు వస్తే వారికి హిందూ, ముస్లింల కొట్లాట గుర్తుకు వస్తుందని అన్నారు. బండి సంజయ్ బీసీల గురించి ఏనాడైనా మాట్లాడావా అని ప్రశ్నించారు.

బీసీల గురించి రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లతో బిల్లును రూపొందించి డిల్లీకి పంపిస్తే ఆమోదించడం లేదని విమర్శించారు. బండి సంజయ్ నిజమైన బీసీ నాయకుడు కాదని, బీసీల బిల్లుపై మాట్లాడకుండా డిల్లీలో కిషన్‌రెడ్డి అడుగులకు మడుగులు ఒత్తుతున్నాడన్నారు. బండి సంజయ్ బీసీల్లో ఉన్న దేశ్‌ముఖ్ అని విమర్శించారు. బండి సంజయ్ భవిష్యత్ బీసీ తరాలకు ద్రోహం చేస్తున్నాడ న్నారు. అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ పార్టీ ఏనాడూ పేదల గురించి ఆలోచించలేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే మూడు ముక్కలైందని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల నాటికి పూర్తిగా కనుమ రుగవుతుందని తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో వంద సీట్లతో గెలు పొంది చొప్పదండిలోనే విజయోత్సవ సమావేశం నిర్వహి స్తామన్నారు.


◄ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మీనాక్షి నటరాజన్

● కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నట రాజన్ మాటాడుతూ పేదల కష్టాలు తెలుసుకోవడానికే పాదయాత్ర చేస్తున్నామన్నారు. పేదల కళ్లలో ఆనందం చూడడమే కాంగ్రెస్ ధ్యేయమన్నారు. కాంగ్రెస్ నేత వెంకటస్వామి సేవలను గుర్తు చేస్తూ తెలంగాణలో ఆయన పేరుతో తెలియని వారు లేరన్నారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, గడ్డం వివేక్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, శాసన సభ్యుడు మేడిపల్లి సత్యం, మక్కాన్‌సింగ్, ప్రభుత్ విప్ ఆదిశ్రీనివాస్, ప్రభుత్వ సలహాదారు హర్కార్ వేణుగోపాల్‌రావు, మాజీ ఎమ్మెల్సీలు జీవన్‌రెడ్డి, భానుప్రసాద్‌రావు, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సత్తు మల్లేశం, పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, రుద్ర సంతోష్, అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కురిక్యాల నుంచి మధురానగర్ జనహిత పాదయాత్రలో భారీ సంఖ్యలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

చివరి రక్తం బొట్టు వరకు సేవ చేస్తా

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



గంగాధర: తన చివరి రక్తంబొట్టు వరకు చొప్పదండి నియోజకవర్గానికి సేవ చేస్తానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. జనహిత పాదయాత్రలో భాగంగా గంగాధర మండలం మధురానగర్‌లో ఏర్పాటు చేసిన రోడ్ షోలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో దోచుకు న్నదని విమర్శించారు. ఒక్క ఎకరానికైనా కొత్తగా బీఆర్ఎస్ వాళ్లు నీళ్లు ఇవ్వలేదని, ఒకవేళ ఇచ్చి ఉంటే నేలకు ముక్కు రాస్తానని అన్నారు. నారాయణపూర్ ఎత్తు పెంచి సాగు ఆయకట్టు పెంచతామని, కొండగట్టు ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు.

ముఖ్యమంత్రి చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు దేశంలో మరెక్కడా లేవు: మాజీ మంత్రి టి జీవన్‌రెడ్డి



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు దేశంలో మరెక్కడా లేవని మాజీ మంత్రి టి జీవన్‌రెడ్డి అన్నారు. పేదవాడికి పట్టెడు అన్నం పెట్టాలని సన్నబియ్యం ఇస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం దశాబ్దకాలంలో పేదలకు ఒక్క ఇల్లు అయినా కట్టారా అని ప్రశ్నించారు. గృహ నిర్మాణ శాఖ పూర్తిగా నిర్వీర్యం అయిందన్నారు. భారత్ జోడో యాత్ర చేపట్టి రాహుల్‌గాంధీ రెండు రాష్ట్రాల్లో పార్టీని అధికారంలోకి తెచ్చారని అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నామన్నారు.

బీసీ రిజర్వేషన్లు ఇచ్చి తీరుతాం

రాజ్యసభ మాజీ ఎంపీ వి హన్మంతరావు



బీసీ రిజర్వేషన్ల ఇచ్చి తీరుతామని రాజ్యసభ మాజీ ఎంపీ వి హన్మంతరావు అన్నారు. తనకన్నా పెద్ద రామభక్తుడు ఎవ్వరని ప్రశ్నించారు. దేవుళ్ల పేరిట బీజేపీ నాయకులు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

ఫార్మసీ ఆఫీసర్ల మెరిట్ లిస్టు ప్రకటించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్

సుభాష్‌నగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వైద్య,ఆరోగ్యశాఖలో మెడికల్ అండ్ హెల్త్‌సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డుద్వారా పరీక్షలు రాసిన ఫార్మసీ ఆఫీసర్స్‌కు సంబంధించిన ప్రొవిజనల్ మెరిట్‌లిస్టు ప్రకటించి నియామక ఉత్తర్వులు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వ ఫార్మసీఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్ కోరారు. ఆదివారం కరీంనగర్ వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రభుత్వ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లాసమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఫార్మసిస్టుల 50ఏళ్ల చిరకాల స్వప్నం ఫార్మసీ ఆఫీసర్‌కల నెరవేర్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఫార్మసీఆఫీసర్లకు ప్రొవిజనల్ మెరిట్‌లిస్టు ప్రకటించడంలో జాప్యం తగదని, కోర్టు కేసుతో సంబంధం లేకుండా వెంటనే ఫలితాలు ప్రకటించాలని కోరారు. ఈ విషయాన్ని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రితోపాటు ప్రిన్సిపల్‌సెక్రెటరీ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. 104సర్వీస్‌లో పనిచేస్తున్న ఫార్మసీ ఆఫీసర్స్‌కు ఐదునెలలుగా కంటిన్యూయేషన్ లేక జీతాలు నిలిపివేశారని, ఈ విషయంపై హెల్త్ కమిషనర్‌తో చర్చించి వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. టీఆర్ఎస్‌కేలో పనిచేస్తున్న ఫార్మసీ ఆఫీసర్లకు కూడా ప్రతీనెల జీతాలు సక్రమంగా రావడానికి కృషిచేస్తానన్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కందకట్ల శరత్‌బాబు, రాష్ట్ర ప్రధానకార్యదర్శి సురేష్ కళ్యాణ్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటుచేసిన జిల్లాల్లో జిల్లాఫార్మసీ ఆఫీసర్ల నియామకం, డీపీఎస్‌లలో కూడా ఫార్మసీ ఆఫీసర్ల పోస్టులు ఉండేలా ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, వివిధ ఏజెన్సీల ద్వారా పనిచేస్తున్న ఫార్మసీ ఆఫీసర్లందరికి సమాన పనికి సమాన వేతనం అందేలా కృషి చేస్తానన్నారు. హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు పి రామారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉదయ్ ప్రసాద్, పంద్రాల శంకర్, విజయభాస్కర్ రెడ్డి, రాష్ట్ర సలహాదారు అహ్మదుల్లా ఖాన్ మాట్లాడుతూ ఇన్‌ఫార్మసీ ఆఫీసర్లకు విద్యార్హతల ఆధారంగా డైటీషియన్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, డ్రగ్ అనాలసిస్టు పోస్టులలో ప్రాధాన్యం కల్పించాలన్నారు. ఉమ్మడిజిల్లా గౌరవాధ్యక్షుడు ప్రభాకర్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు వెలుతురు రవీందర్, కార్యదర్శి శ్రావణ్‌కుమార్, కరీంనగర్ కార్యదర్శి సుధాకిరణ్, అసోసియేట్ ప్రెసిడెంట్ రాజమల్లు, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఎండీ జంషీద్‌అలీ, కార్యదర్శి ఎండీ షౌకత్‌అలీ, రాజన్న సిరిసిల్ల జిల్లాఅధ్యక్షుడు సతీష్, కార్యదర్శి రాజ్‌కుమార్, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు వగ సుధాకర్‌రెడ్డి, వరంగల్ జిల్లావర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్, అసోసియేట్ ప్రెసిడెంట్ అవినాష్, హన్మకొండ జిల్లా ఉపాధ్యక్షుడు రాకేష్, మురళీధర్ రెడ్డి, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కవ్వంపల్లికి ప్రముఖుల పరామర్శ


పరామర్శిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్

కరీంనగర్ అర్బన్/మానకొండూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ ఎమ్మెల్యే, డీసీసీఅధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పరామర్శించారు. ఎమ్మెల్యే సోదరుడు రాజేశం ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఆదివారం గంగాధర మండలంలో ఆదివారం జనహిత పాదయాత్ర కార్యక్రమానికి వెళ్తుండగా మార్గమధ్యలో కరీంనగర్ వాల్మీకినగర్‌లోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కాల్ వేణుగోపాల్‌రావు, గనులు, భూగర్భశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్సీ బానుప్రసాద్, టీపీసీసీ అధికారప్రతినిధి మేన్నేని రోహిత్‌రావు, డీసీసీ ఉపాధ్యక్షుడు మల్యాల సుజిత్ కుమార్, బెజ్జంకి మార్కెట్ కమిటీ ఛైర్మన్ పులి కృష్ణ ఉన్నారు.

● ఆదివారం ఉదయం ఎమ్మెల్యే కవ్వంపల్లిని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రాంమోహన్, నల్గొండ జిల్లా ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ సత్తు మల్లేశం, జిల్లా సహకారబ్యాంక్ అధ్యక్షుడు కొండూరు రవీందర్‌రావు, టీపీసీసీ ప్రధానకార్యదర్శి గజ్జెల కాంతం, మాజీ సుడా డైరెక్టర్ కామారపు శ్యాం పరామర్శించారు. కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎర్ర శ్రీనివాస్, మాజీ అసెంబ్లీ అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, నాయకులు ఉన్నారు.

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా మణికంఠరెడ్డి


మణికంటరెడ్డి

భగత్‌నగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యునిస్టు పార్టీ(సీపీఐ) రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నగరానికి చెందిన కసిరెడ్డి మణికంఠ రెడ్డి ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో నిర్వహించిన సీపీఐ నాలుగో రాష్ట్ర మహాసభల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మణికంటరెడ్డి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన తనఎన్నికకు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ

● కిటకిటలాడిన ఆలయాలు


నృసింహుడి దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

ధర్మపురి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో ఆదివారం సెలవుదినం కావడంతో భక్తుల రద్దీ నెలకొంది. ఉదయం నుంచి లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలు నరసింహ, గోవింద నామ స్మరణలతో ప్రతి ధ్వనించాయి. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలిచైర్మన్ జక్కురవీందర్, అర్చకులు, సిబ్బంది భక్తులకుసేవలు అందించారు. కార్యక్రమంలో ఆలయసూప రింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, అలువాల శ్రీనివాస్ తదితరులున్నారు.

ఘనంగా గోపాల కాల్వలు..


ధర్మపురి క్షేత్రంలో ఆర్యవైశ్య మహిళల కోలాట నృత్యం

శ్రావణమాసం ముగింపు సందర్భంగా ధర్మపురి క్షేత్రంలో గోపాలకాల్వలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. లోక క్షేమార్థం ఏటా నిర్వహించే విధంగా ఉదయం దివంగత ప్రముఖ వ్యాపారి చాడ గంగన్న కుటుంబసభ్యులు స్థానిక లక్ష్మీనరసింహ స్వామి, రామలింగేశ్వరస్వామి వారలకు అభిషేకాలు, ప్రత్యేకపూజలు చేయించారు. అనంతరం ఉగ్రనారసింహుని ఆలయంలో రాజరాజేశ్వరీ భజనమండలి సభ్యులు, ఆర్యవైశ్యులు, భక్తులు భజన చేశారు. అనంతరం ఆర్యవైశ్యులు, భక్తులు భక్తిశ్రద్ధలతో పాటలు పాడుతూ గోదావరి నది వరకు ఊరేగింపు జరిపారు. దారిపొడవునా చిన్నారులు నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ జక్కు రవీందర్, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, చాడ కుటుంబ సభ్యులు చాడ శ్రీనివాస్, వెంకటరమణ, శ్రీనాథ్, ధర్మపురి పీఏసీఎస్ ఛైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ధర్మపురి మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, ఆర్యవైశ్య వర్తక సంఘాల మండల, పట్టణ శాఖ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరతకు కేంద్రం కారణం

● సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి

జమ్మికుంట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరతకు కేంద్ర ప్రభుత్వమే కారణమని సీపీఎం జిల్లాకార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. ఆదివారం జమ్మికుంటలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ఇవ్వాల్సిన కోటాలో కోతపెట్టడం వల్లే యూరియా కొరత ఏర్పడిందన్నారు. ఈ విషయంలో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడిపెంచి రాష్ట్రానికి రావాల్సినకోటాను తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శీలం అశోక్, బాసర సంపత్‌రావు, జక్కుల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వర ఆలయంలో పనులు వేగంగా పూర్తి చేయాలి

● భక్తులకు ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా చేపట్టాలి

● సమీక్ష సమావేశంలో అధికారులతో విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాజన్న ఆలయ మొదటిదశ అభివృద్ధి పనుల్లో భాగంగా భక్తులకు బీమేశ్వర ఆలయంలో దర్శనాలు కల్పించేందుకు జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సందీప్ కుమార్‌ఝా, ఎస్పీ మహేష్ బీ గితే, ఈవో రాధాబాయితో పాటు వివిధశాఖల అధికారులతో ఆదివారం ఆలయ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ముందుగా రాజన్న ఆలయానికి వచ్చిన వీరికి ఆలయఅర్చకులు ఘనస్వాగతం పలికారు. ప్రత్యేకపూజలో పాల్గొన్న అనంతరం అర్చకులు ఆశీర్వచనం ఇచ్చారు. అనంతరం సమావేశంలో ఆది శ్రీనివాస్


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్

మాట్లాడుతూ బీమేశ్వర ఆలయంలో కల్యాణ మండపం, హోమం, వ్రతమండపం, షెడ్ నిర్మాణం, క్యూలైన్లు, సీసీఫ్లోరింగ్ పనులు చేపడుతామన్నారు. భక్తులకు దర్శనం కోసం చేస్తున్న పనులపై ఆరాతీశారు. సమ్మక్క-సారక్కజాతర వస్తున్ననేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. పనులు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. పనుల్లో అలసత్వం ప్రదర్శించవద్దని సూచించారు.

ముగిసిన యూత్ కాంగ్రెస్ నిరాహార దీక్ష



నిరాహార దీక్షలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు వి హనుమంతరావు

గణేశ్‌నగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర సెక్రెటరీ, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ జ్ఞాన్‌ప్రతిష్ట కరీంనగర్‌జిల్లా అధ్యక్షుడు వుమ్మెంతుల శ్యాంసుందర్ రెడ్డి ఆధ్వర్యంలో గీతాభవన్ చౌరస్తా వద్ద ఓట్ చోర్ మోడీ హటావో దేశ్‌కి బచావో అనే నినాదంతో చేపట్టిన రిలేనిరాహార దీక్ష ఆదివారం ముగిసింది. సీనియర్ నాయకులు వి.హన్మంతరావు, సూడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మైనారిటీసెల్ జిల్లా అధ్యక్షుడు తాజుద్దీన్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్ రెడ్డి, పొన్నం మధు మాట్లాడుతూ దేశంలో విచ్చలవిడిగా బీజేపీ పెద్దలు ఓట్లను దొంగిలిస్తున్నారని ఆరోపించారు. వీటిపై ఆధారాలతో సహా కాంగ్రెస్ అగ్రనేత బట్టబయలు చేసినా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. ఓట్ల చోరీపై తక్షణమే ఎలక్షన్ కమిషన్ స్పందించాలని,ఓట్లజాబితాను తొలగించాలని డిమాండ్ చేశారు. యూత్‌కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బోయిన కృష్ణబాబు, కిమ్‌ఫహద్, సయ్యద్ సజాద్, తాళ్లపల్లి శ్రీకాంత్, అజీమ్, ఎల్కపెల్లి సిద్ధార్థ, పురుషోత్తం, వడ్డేపల్లి విష్ణువర్ధన్, ఉమ్మెత్తుల ఆశీష్‌రెడ్డి, దూడ శ్రీకాంత్, మాట్ల రాజేష్, శనిగరపు దినేష్, వినీత్, సూరంసాయి,మహిళా నాయకురాలు రాజేశ్వరి అనూష పాల్గొన్నారు.

మొక్కజొన్న రక్షణకు..రైతుల పాట్లు

● నష్టపరుస్తున్న కోతులు, రామచిలుకలు

● మండలంలో 8,600 ఎకరాల్లో మొక్కజొన్న సాగు


మైకుతో కాపలా కాస్తున్న రైతు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నో కష్టాలకు ఓర్చి ఆరుగాలం కష్టపడి పంటను పండిస్తే పంటలు చేతికి వచ్చే దశలో కోతులు, రామ చిలు కలు రైతులకు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. మొక్క జొన్న పంట దశలో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. కోతులు, అడవిపందులు, రామ చిలుకల బారినుంచి పంటను కాపాడుకునేందుకు రైతులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కొందరు రైతులు పంట చుట్టూ చీరలు కట్టి రక్షించుకుంటే మరికొంతమంది రైతులు చుట్టూ జాలీలు ఏర్పాటు చేస్తున్నారు. మొక్కజొన్న పంటలో మైకులను అమర్చి కొందరు రైతులు పంటను కాపాడే ప్రయత్నం చేస్తున్నారు.


కంకులను నాశనం చేసిన చిలుకలు


మొక్కజొన్న పంటకు చీరలతో రక్షణ

ఇబ్రహీంపట్నం మండ లంలో సుమారుగా 8,600 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు. పంట 100 నుంచి 120 రోజుల్లో కోతకు వస్తుంది. విత్తనం నాటిన నుంచి సుమారుగా 70 రోజుల్లో మొక్కజొన్న కంకులు వస్తా యి. అక్కడి నుంచి సుమారుగా నెల రోజుల పాటు మొక్కజొన్నను కాపాడుకునేందుకు రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు కాపలా ఉండాల్సి వస్తోంది. పంట నాటిన నుంచి ఏదో ఒక రకంగా రైతులు ఇబ్బందులకు గురవుతూనే ఉంటారు. కొన్ని రోజులు వర్షాభావ పరిస్థితులతో, యూరియా కొరతతో కొన్ని రోజులు, భారీ వర్షాలతో మరి కొన్ని రోజులు ఇలా పంట చేతి కొచ్చే వరకు రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఆర్చరీ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న చికిత

ఎలిగేడు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన తానిపర్తి శ్రీలత శ్రీనివాస్‌రావు కూతురు తానిపర్తి చికిత కెనడాలో జరిగిన ప్రపంచ ఆర్చరీ అండర్21 చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నది. ఆర్చరీలో శిక్షణ పొందిన ఆమె స్పోర్ట్స్ అథారిటీ తరపున కెనడాలో జరుగుతున్న పోటీలో పాల్గొంది. శనివారం చాంపియన్‌షిప్ సాధించింది. మాజీసర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, మాజీఎంపీపీ తానిపర్తిస్రవంతి మోహన్‌రావు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.



మెడల్స్‌తో చికిత

నాయకా..! వినాయకా..!!

(5వ పేజీ తరువాయి)

విగ్రహాలు తయారుచేస్తున్నారు. స్థానిక కళాకారులతో పాటు రాజస్థాన్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి కళాకారులను రప్పించి విగ్రహాలు చేయించారు. మరికొందరు వ్యాపారులు మహారాష్ట్ర, హైదరాబాద్, విజయవాడ, జగిత్యాల, వరంగల్ ప్రాంతాల నుంచి భారీ విగ్రహాలను తీసుకువచ్చి విక్రయాలు జరుపుతున్నారు. మహారాష్ట్ర నుంచి తీసుకువచ్చిన విగ్రహాలు కలరింగ్‌తోపాటు విభిన్నంగా కనిపిస్తున్నాయి. సిరిసిల్లలోనే పెద్ద సైజు విగ్రహాలు 15వేల రూపాయల నుంచి 70వేల రూపాయల వరకు విగ్రహాలు తెచ్చి అమ్మకాలు జరుపుతున్నారు. లక్షనుంచి మూడులక్షల రూపాయల వరకు ఉండే భారీవిగ్రహాలను సైతం యువజన సంఘాల నాయకులు హైదరాబాద్ నుంచి తీసుకువచ్చి ప్రతిష్ఠించడానికి ఏర్పాట్లుచేశారు. గతంలో కంటే ఈసారి ధరలు 10నుంచి 20 శాతంవరకు పెరిగాయి. చిన్నవిగ్రహాలు సైతం భారీ ధరలే ఉండడంతో సామాన్యప్రజలకు ఉత్సవాలు భారంగానే మారుతున్నాయి. ఆగస్టు27న ప్రారంభమయ్యే చవితి ఉత్సవాల కోసం సిరిసిల్ల జిల్లా కేంద్రంతో పాటు వేములవాడ, మండలకేంద్రాల్లో, గ్రామాల్లో మండపాలను ఏర్పాటు చేస్తున్నారు.

రేపు పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణ

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు



మాట్లాడుతున్న పర్శ హన్మాండ్లు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో ఈనెల 26న మహాత్మా జ్యోతిబా పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘం భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రం అంబేద్కర్ చౌరస్తా జిల్లా గ్రంథాలయం ఎదురుగా ఏర్పాటుచేసిన మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణకు ముఖ్య అతిథులుగా బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి హాజరవుతున్నారన్నారు. మహనీయుల విగ్రహాల ఆవిష్కరణకు జిల్లాలోని బీసీ శ్రేణులు బాధ్యతగా పాల్గొన్నాన్నారు. ఈ సమావేశంలో నాయకులు తడుక కమలాకర్, కోడం రవీందర్, చొక్కి కైలాసం, కూర అంజనేయులు, శ్రీనివాస్, తిరుపతి పాల్గొన్నారు.

సాగునీటి కాల్వ మరమ్మతు పనులకు శ్రీకారం



పూడికతీత పనులను ప్రారంభిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సింగసముద్రం చెరువులోకి వచ్చే కాల్వ గండి పడి నీరు వృథాగా పోతుండడం వల్ల రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి గ్రామాలకు చెందిన రైతులు శ్రమదానం చేయడానికి ముందుకు వచ్చిన నేపథ్యంలో స్పందించిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ మరమ్మతు పనులకు సహకారం అందించారు. పూడిక తీత పనులకు అయ్యే ఖర్చులను భరిస్తానని పేర్కొంటూ భారీ వాహనాన్ని సమకూర్చారు. ఆదివారం బీఆర్‌ఎస్ నాయకలు పూడిక తీత పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణహరి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శివరాములు, దేవరెడ్డి, బాలయ్య, సురేందర్‌రెడ్డి, కిష్టారెడ్డి, సత్యంరెడ్డి, పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు

ఇల్లంతకుంట : మండలంలోని వల్లంపట్లసమీపంలోని రోడ్డుకు శ్రమదానం ద్వారా తాత్కాలిక మరమ్మతులు చేశారు. వల్లంపట్ల, ఒగులాపూర్ గ్రామాల మధ్య రోడ్డు చెడిపోవడంతో ఆర్టీసీ బస్సులను తగ్గించగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనితో ఆదివారం గ్రామానికి చెందిన నాయకులు, యువకులు ఏకమై రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెట్లకొమ్మలను కొట్టడంతోపాటు గుంతలను పూడ్చారు. ఆర్టీసీ అధికారులు వచ్చి రోడ్డును పరిశీలించి గతంలో మాదిరిగా బస్సులను నడుపుతామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మ్యాకల శ్రీనివాస్‌యాదవ్, నాయకులు విజయ్, అనీల్, రాజయ్య, తాట్ల వీరేశం, తిరుపతి, రాజు, భూమయ్య పాల్గొన్నారు.

పీడిత ప్రజల అభ్యున్నతికి కృషి చేసిన 'సురవరం'

ముస్తాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : పీడిత ప్రజల అభ్యున్నతికి సురవరం సుధాకర్‌రెడ్డి కృషిచేశారని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు పేర్కొన్నారు. సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో పోతుగల్‌లో సురవరం సుధాకర్‌రెడ్డి సంతాప సభను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల బీరుగు రాజు,ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు కుర్ర రాకేశ్, అనమేని భుమన్న, జిల్లా నాయకులు మిద్దె నర్సయ్య, నేరేడు బాలయ్య, బొంపెల్లి పరిచయ, కంచం రవి, నేరేడు నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు ప్రణాళిక లేకపోవడం వల్లే యూరియా కష్టాలు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళిక లేకపోవడం వల్ల యూరియా లభించక కష్టాలు తప్పడం లేవని బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు శ్రీరాంనాయక్ ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వమని పేర్కొంటున్న కాంగ్రెస్ సర్కారు అన్నదాతల ఎరువు ఇబ్బందులను తీర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రఫీ, తిరుపతి, రాములు, అశోక్ ఉన్నారు.

గంభీరావుపేట ఎస్‌ఐగా అనిల్‌కుమార్

గంభీరావుపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట ఎస్‌ఐగా అనిల్‌కుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎస్‌ఐగా పని చేసిన రమాకాంత్ బోయినపల్లికి బదిలీ కాగా, వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా పనిచేస్తున్న అనిల్‌కుమార్ గంభీరావుపేటకు బదిలీపై వచ్చి బాధ్యతలు తీసుకున్నారు.

మానేరు బ్రిడ్జిపై నాయకులకు పట్టింపేది?

గంభీరావుపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట-లింగన్నపేట గ్రామాల మధ్య హైలెవల్ బ్రిడ్జి నిర్మాణంపై నాయకులకు పట్టింపు లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఇండియా ప్రజాబంధు పార్టీ జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం ఆరోపించారు. లింగన్నపేట మానేరు వాగు వద్ద ఆదివారం చంద్రం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రతి వర్షాకాలంలో ఎగువ మానేరు మత్తడి దూకిన సమయంలో పాతలో లెవల్ వంతెన మునిగిపోవడంతో ఈ మార్గం వెంట రాకపోకలు నిలిచిపోయేవన్నారు. హైలెవల్ బ్రిడ్జి కోసం ప్రజలు పాలకులకు విన్నవించడంతో గత ప్రభుత్వ హయాంలో బ్రిడ్జి నిర్మాణంకు నిధులు మంజూరైనప్పటికి పనుల్లో జాప్యం జరుగుతోందని వాపోయారు. కొత్త బ్రిడ్జి కోసం ఉన్న పాతలో లెవల్ వంతెనను కూల్చేయించిన నాయకులకు కొత్త హైలెవల్ బ్రిడ్జి నిర్మాణంలో శ్రద్ధ ఎందుకు లేదని మండిపడ్డారు. కొత్త బ్రిడ్జి నిర్మించే శక్తిలేనప్పుడు పాత బ్రిడ్జిని కూల్చే అధికారం ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. పాతబ్రిడ్జి కూల్చేసిన స్థలంలో తాత్కాలికంగా వాహనల రాకపోకల కోసం వేసిన మట్టిరోడ్డు ప్రతి వర్షాకాలంలో కొట్టుకపోవడంతో ప్రజలు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కుంటున్నారన్నారు. మట్టి రోడ్డు కొట్టుకపోయిన ప్రతిసారీ తిరిగి రోడ్డు వేయాలంటే నెలల సమయం పడుతోందని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. త్వరగా హైలెవల్ బ్రిడ్జి నిర్మాణంచేపట్టాలని, లేకుంటే మానేరు వాగు వద్ద నిరాహార దీక్ష చేపడుతామని వెల్లడించారు.

సమస్యల వలయంలో జ్యోతినగర్



సిరిసిల్ల జ్యోతినగర్‌లో రోడ్డుపక్కనే నిల్వ ఉన్న మురుగునీరు



బురదమయంగా మారిన మట్టి రోడ్డు

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : డ్రైనేజీలు లేక రోడ్లపైనే మురుగు నీరు పారుతుండడం, ఎక్కడి చెత్త అక్కడే ఉండడంతోపాటు మట్టి రోడ్లతో జ్యోతినగర్ వాసులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని జ్యోతినగర్ గతంలో చంద్రంపేట గ్రామపంచాయతీ పరిధిలో ఉండేది. సిరిసిల్ల పట్టణ శివారులో ఉన్న గ్రామాలను మున్సిపల్‌లో విలీనం చేయడంతో జ్యోతినగర్, రగుడులను కలిపి 1వ వార్డుగా మార్పులు చేశారు. దీంతో జ్యోతినగర్‌ను ఎవరూ పట్టించుకోకపోవడంతో సమస్యలమయంగా మారింది. జ్యోతినగర్‌లో కొన్ని ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లను గ్రామపంచాయతీ హయాంలో సిమెంట్ రోడ్లను నిర్మించగా, డ్రైనేజీలు నిర్మించకపోవడంతో ఇళ్లనుంచి వచ్చే మురికినీరు రోడ్లపైనే పారుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా పారిశుధ్య కార్మికులు లేకపోవడంతో రోడ్లపై చెత్తాచెదారం పెరుకుపోతోంది. కొన్ని ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు లేకపోవడంతో వర్షం పడితే మట్టిరోడ్లు బరదమయంగా మారి నడవడానికి వీలులేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వార్డులో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతుండడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

మురుగు కాలువలు లేక తీవ్ర ఇబ్బందులు..

- పులి తేజస్విని, జ్యోతినగర్



జ్యోతినగర్ మురికికాలువలు లేకపోవడంతో ఇళ్లలో నుంచి మురికినీరంతా రోడ్లపైనే పారుతుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మురికికాలువలు, సిమెంట్ రోడ్డు నిర్మించాలని స్థానిక ప్రజాప్రతినిధితో పాటు అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదు. పారిశుధ్యం పనులు చేయకపోవడంతో ఇళ్ల వద్దనే చెత్తాచెదారం పేరుకుపోయింది. మున్సిపల్ అధికారులు స్పందించి పారిశుధ్య పనులు చేయించాలి.

కపట ప్రేమతో కేటీఆర్ ఉత్తరం

- కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



సిరిసిల్లలో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ డిప్యూటీ సీఎంకు కపట ప్రేమతోనే ఉత్తరం రాశారని, ఈ విషయమై ఆయన ఆత్మవిమర్శ చేసుకోవాలని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మా ట్లాడారు. రాష్ట్రం అప్పులపాలు కావడానికి, సిరిసిల్లలో బకాయిల పెరగడానికి కారణం కేసీఆర్ పాలన అని ఆరోపించారు. సిరిసిల్ల నేత కార్మికులకు కేటీఆర్ చేసిందేమీలేదని, సిరిసిల్ల పద్మశాలిల జీవితాలు బాగుపడినట్లు అయితే ఈ పరిస్థితుల్లో ఎందుకు ఉన్నారో కేటీఆర్ ఆలోచన చేయాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవినీతి అక్రమ పాలన వల్ల ఈ రాష్ట్రంపైన రూ.8లక్షల కోట్లు అప్పులు పెట్టిందని ఆరోపించారు. రూ.45వేల కోట్ల నుంచి 50వేల కోట్ల వరకు బకాయిలను పెట్టిందన్నారు. సిరిసిల్ల ప్రాంతంపైన కేటీఆర్‌కు నిజంగా ప్రేమ ఉంటే రాజకీయ జీవి తాన్ని ఇచ్చిన పద్మశాలీల జీవితాలను బాగుపరచాలన్నారు. సిరిసిల్లలో ఎమ్మెల్యేగా గెలిపించినప్పటికి కూడా ప్రభుత్వం తమ బాధ్యతలను నిర్వర్తించాల్సి ఉంటుంది కాబట్టి బేషజాలకు వెళ్లకుండా బతుకమ్మ చీరల బకాయిలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినాక ప్రభుత్వ శాఖల డ్రెసకోడ్ కోసం నేతన్నల దగ్గర నుంచి వస్త్రాలను కొనుగోలు చేయాలని జీవో నంబర్ 1ను తీసుకవచ్చిందన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీని తీసుకొచ్చి రూ.37.50కోట్లను చెల్లించిందన్నారు. త్రిఫ్ట్ సెకండ్ ఫేస్ కింది రూ.12కోట్లు చెల్లించిందన్నారు. వేములవాడలో యారన్ డిపోను ఏర్పాటు చేసి రూ.50కోట్లు వెచ్చించి ఆసాముల చిరుకాల కోరికను నేరవేర్చగా ఇప్పటివరకు రూ.2253 మెట్రిక్ టన్నుల యారన్‌ను సబ్సిడీ ద్వారా ఇచ్చిందన్నారు. బతుకమ్మ చీరలలో నాణ్యత లోపాలతో ఉన్నందున్న వాటిని పక్కన బెట్టి ఇందిరా మహిళా శక్తి సంఘాల సభ్యులకు ఒక్కొక్కరికి రెండు చీరలు ఇవ్వాలని నాణ్యమైన బట్టలను తయారు చేసే విధంగా రూ. 270 కోట్ల విలు చేసే చీరలను ఉత్పత్తి చేయడం కోసం ఆర్డర్లు ఇచ్చిందన్నారు. దసరా, దీపావళికి ప్రతి మహిళ సంఘాలకు చీరలను ఇవ్వడానికి పనులు వేగవంతంగా నడుస్తున్నాయన్నారు. ఈనెల 26న మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా త్రిఫ్ట్ పథకం కింద వారికి రావాల్సిన డబ్బులు ఇవ్వనున్నామన్నారు. నేతన్న బీమాలో దాదాపు 6వేల మంది చేరారన్నారు. ఒక్కొక్కటిగా పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం చేసుకుంటూ పోతుంటే ఎక్కడ ఉనికిని కోల్పోతామేమో అని కేటీఆర్‌కు భయం పట్టుకుందన్నారు. 2023లో జరిగిన ఎన్నికల్లో సిరిసిల్ల పద్మశాలి సంఘం, వస్త్రవ్యాపారులను బిల్లులు రావని బెదిరించి మర్కండేయ కండువాలతో పాటు బీఆర్‌ఎస్ కండువాలు వేసి ఇంటింటికి ప్రచారానికి తిప్పింది నిజం కాదా అన్నారు. రాజకీయాలు వేరు వ్యాపారాలు వేరు అని కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి చెపుతుందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఉపాధ్యక్షుడు బొప్ప దేవయ్య, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు దుబాల వెంకటేశం, కాసర్ల రాజు,నక్క నర్సయ్య, టీపీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, మాజీ కౌన్సిలర్లు యెల్లె లక్ష్మీనారాయణ, ఆడెపు చంద్రకళ,కత్తెర దేవదాస్, వెంగళ లక్ష్మీనర్సయ్య, వేముల రవి, రాగుల జగన్, నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాజాబహదూర్ వెంకటరామరెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

- రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : కొత్వాల్ రాజ బహదూర్ వెంకట రామరెడ్డి విగ్రహాన్ని కలెక్టరేట్ చౌరస్తాలో ఏర్పాటు చేయాలని రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని లహరి బాంక్వెట్ హాల్‌లో జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కొత్వాల్ రాజా బహదూర్ వెంకటరామరెడ్డి జయంతిని పురస్కరించుకొని ప్రతిభా పురస్కారాల ప్రదాన మహోత్సవం ఘనంగా జరిగింది. పదవ తరగతిలో 24 మంది, ఇంటర్‌లో 13 మంది రాష్ట్ర, జిల్లా స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన విద్యార్థినీ విద్యార్థులకు జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు కొత్వాల్ రాజా బహదూర్ వెంకటరామ రెడ్డి ప్రతిభా పురస్కారాలతో పాటు బహుమతులను అందించి అభినందించారు. అనంతరం సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్మూల స్వరూప తిరుపతిరెడ్డి, ఉత్తమ ఉపాధ్యాయులుగా ప్రశంసా పత్రాలను అందుకున్న ప్రభుత్వ ఉపాధ్యాయులను నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ పేద రెడ్డి బిడ్డలకు ఉన్నత విద్యను అందించడం కోసం వెంకటరామరెడ్డి వసతి గృహాలను ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి దోహదపడ్డారని అన్నారు. ఆయన ఏర్పాటుచేసిన వసతి గృహాల నుంచి సినారె, రావి నారాయణరెడ్డి, చెన్నారెడ్డి వంటి గొప్ప వ్యక్తులు చైతన్యవంతులుగా ఎదిగారని అన్నారు. అన్ని రంగాలలో ఆయన చేసిన సేవలను మరవలేమని అంతటి గొప్ప వ్యక్తి విగ్రహాలు లేకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం కొత్వాల్ రాజా బహదూర్ వెంకట రామరెడ్డి విగ్రహాలను ఏర్పాటు చేసి గౌరవించాల్సిన బాధ్యత ఉందన్నారు. పనికి మాలిన ఓ వ్యక్తి సోషల్ మీడియా ద్వారా రెడ్లను అసభ్యకర వ్యాఖ్యల చేసి కించపరచాడని మరోసారి పునారావృతం అయితే రెడ్డి సామాజిక వర్గం ఊరుకోదని హెచ్చరించారు. బీసీ నాయకులు వారివారి ఉద్యమాలను కొనసాగిస్తూనే రెడ్డి సామాజిక వర్గాన్ని గౌరవించారని అన్నారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్మూల స్వరూపతిరుపతిరెడ్డి మాట్లాడుతూ రెడ్డి సామాజిక వర్గం పార్టీలకు అతీతంగా ఉంటూ ఐక్యతను చాటాలన్నారు. భవిష్యత్తులో మనకు మనమే పోటీ పడాలని, మంచి విజయాలను సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, జిల్లా కోర్ కమిటీ సభ్యులు పూర్మాణి లింగారెడ్డి, భూనాపురం రంగారెడ్డి, న్యాలకొండ రాఘవరెడ్డి, పాతూరి మహేందర్‌రెడ్డి, పొన్నాల బాల్‌రెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నల్ల నాగిరెడ్డి, ఉపాధ్యక్షులు ఎగుమామిడి కృష్ణారెడ్డి, మడుపు ప్రమోద రెడ్డి, సభ్యులు, వివిధ మండలాల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



రాచర్లబొప్పాపూర్‌లో గురువులతో పూర్వ విద్యార్థులు



ముస్తాబాద్‌లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2008-2009 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఒకరినొకరూ ఆత్మీయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలను తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రశాంత్, కార్తీక్, అభి, నదీమ్, సాయికృష్ణ, హరిత, తేజ, రజిని, భవాని తదితరులు పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తిచేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళనాన్ని నిర్వహించారు. 2006-2008లో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులంతా కలిసి కళాశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఒక్కచోట చేరారు. గత స్మృతులను నెమరువేసుకున్నారు. ఆటలాడుతూ నృత్యాలు సంబురాలు జరుపుకున్నారు.

ఈ కార్యక్రమంలో అధ్యపకులు రాజు, శ్రీనివాస్, కిరణ్‌కుమార్, విద్యాసాగర్, మహేశ్ రాధకృష్ణ, విద్యార్థులు బాలు, వేణుయాదవ్ కృష్ణ, సంతోష్, రాజు,నర్సింగం, బూరం స్వప్న, నవనీత, నవీత, మమత, దేవలక్ష్మీ, స్రవంతి, సరిత, రాణి, సుమలత, పద్మ, భాగ్యలక్ష్మీ, రజిత తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

ఇల్లంతకుంట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేపాక గ్రామంలో కరీంనగర్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం విజయవంతం అయ్యింది. గ్రామంలోని రైతు సంఘంలో ఆదివారం జరిగిన వైద్యశిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి దాదాపు రూ.70వేల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. రేపాక గ్రామ రైతుసంఘం, లయన్స్‌క్లబ్ సంయుక్తంగా రూ 60వేల విలువగల బాడీఫ్రీజర్ అందజేశారు. గ్రామంలోని 20మంది వృద్ధులకు చేతికర్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి సుధాకర్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ మైక్రోక్యాబినెట్ సభ్యులు వెంకటరమణారెడ్డి, పుల్లూరి ప్రభాకర్, రైతుసంఘ ప్రతినిధులు రొండ్ల మల్లారెడ్డి, నర్ర భూంరెడ్డి, సరళ, సంపత్‌కుమారి, రొండ్ల ప్రభాకర్‌రెడ్డి, నాగశేషు, సదాశివరెడ్డి, రొండ్ల రాంరెడ్డి, రొండ్ల భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వాహనాలు నడుపొద్దు..

చందుర్తి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావద్దని చందుర్తి ఎస్‌ఐ రమేష్ అన్నారు. చందుర్తి మండలం మూడపల్లిలో ఆదివారం సాయంత్రం వాహనాల తనిఖీచేపట్టారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా, మద్యం సేవించి వాహనాలు నడిపిస్తూ పట్టుబడితే కఠినంగా చర్యలు తప్పవన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్‌శాఖ అనేక చర్యలు చేపడుతున్నా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయని గుర్తుచేశారు. మైనర్లకు తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలు ఇచ్చి రోడ్లపైకి పంపిస్తే భారీ జరిమానాతో పాటు కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఇల్లంతకుంట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వంతడుపుల గ్రామంలో సీసీ రోడ్డు పనులను బీజేపీ నాయకుడు సామ బాల్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ సీసీ రోడ్డుకు రూ 5లక్షలు, మంచినీటి బావికి మోటార్‌ను మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారెడ్డిపల్లె మార్గంలో రోడ్డు పూర్తిగా చెడిపోయినందున సీసీ రోడ్డు వేయడానికి నిధులు కావాలని కోరగానే సంజయ్‌కుమార్ మంజూరు చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కొమ్ముల భూపతిరెడ్డి, చిమ్మనగొట్టు శ్రీనివాస్, మిట్టపల్లి మధు, సామ ఎల్లారెడ్డి, సామ సంతోష్‌రెడ్డి, పాశం రవీందర్‌రెడ్డి, నగునూరి బాలయ్య, నల్ల శ్రీనివాస్, నేరాల అశోక్, గవ్వల కనుకయ్య, బండి అనీల్, అన్నాడి అంజిరెడ్డి, యాద అంజనేయులు, సావనపెల్లి మల్లయ్య, మర్కుడి రవి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

చందుర్తి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి సిరికొండ శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలో బీజేపీ శ్రేణుల ఆధ్వర్యంలో జిల్లా ప్రధానకార్యదర్శిగా సిరికొండ శ్రీనివాస్ నియామకంపై శనివారం రాత్రి టపాసులు పేల్చి సంబరాలు నిర్వహించారు. అనంతరం శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు పొంచెట్టి రాకేష్, చిర్రం తిరుపతి, శ్రీహరి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

బోయినపల్లి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. గంగాధర మండలంలోని ఉప్పరమల్యాల నుంచి మధురానగర్ వరకు కాంగ్రెస్ పార్టీ జనహిత పాదయాత్ర కార్యక్రమం ఆదివారం ఉన్న నేపథ్యంలో తెల్లవారుజామున బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్ తరలించారు. అదుపులోకి తీసుకున్న వారిలో అక్కనపల్లి కరుణాకర్, బూర్గుల నందయ్య, గుంటి శంకర్, చిందం రమేష్, రాజు కట్ట గోవర్ధన్ ఉన్నారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

బోయినపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విలాసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ మండలస్థాయి ఆటలు పోటీలు ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో జయశీల పాల్గొని, ఎంఈవో శ్రవణ్ కుమార్ క్రీడాకారులను అభినందించారు. కబడ్డీ,ఖోఖో, వాలీబాల్, షాట్‌పుట్ 100మీటర్లు, 200 మీటర్ల పెరుగు పందెం పోటీలు నిర్వహించారు.విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబర్ మొదటి వారంలో జరుగు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని, వాలీబాల్‌లో ఎంపికైన అబ్బాయిలకు విలాసాగర్‌లో 5 రోజుల శిక్షణ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు మండల కన్వీనర్ పంతం ప్రభాకర్ తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొలగం శ్రీనివాస్, జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లతిమ్మాపూర్, బాకురుపల్లి, రాచర్లబొప్పాపూర్ గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన పలువురు కుటుంబాలను బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, బ్లాక్ అధ్యక్షుడు నర్సయ్య ఆధ్వర్యంలోని నాయకులు ఆదివారం వేర్వేరుగా పరామర్శించారు. రాచర్లతిమ్మాపూర్‌లో అంజయ్య, బాకురుపల్లిలో లచ్చయ్యలు చనిపోవడంతో వారి కుటుంబాలను ఆగయ్య పరామర్శించారు. రాచర్లబొప్పాపూర్‌కు చెందిన మాజీ జడ్పీటీసీ రాజయ్య సోదరుడు నర్సయ్య, మొడుసు శంకరయ్య భార్య వెంకటమ్మలు మృతిచెందారు. ఆయాకుటుంబాలను కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. నాయకులు లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, శ్రీనివాస్, బాల్‌రెడ్డి, లక్ష్మణ్, శ్రీనివాస్‌రెడ్డి ,సుభాష్, సీత్యానాయక్ తదితరులు ఉన్నారు.

స్వాగతోత్సవానికి తరలిన నాయకులు

ఇల్లంతకుంట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జనహిత పాదయాత్రకు వస్తున్న ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌లకు స్వాగతం పలుకడానికి మండల కాంగ్రెస్ నాయకులు ఆదివారం వెళ్లారు. బెజ్జంకి క్రాసింగ్ వద్ద పార్టీ ఏర్పాటు చేయగా మండలనాయకులు వెళ్లి సన్మానించారు. వీరిలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు రమణారెడ్డి, అయిలయ్య, నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షురాలు తీగల పుష్పలత, నాయకులు ఆనందరెడ్డి, బొల్లవేని రమేష్, నీలం అంజయ్య, జెట్టి మల్లేశం, కానుపాక రమేష్, కూనబోయిన బాలరాజు, ఎలుక రామస్వామి, వెలిశాల జ్యోతి, మల్లేశం పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యెల్ల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు బయలుదేరి వెళ్లి జనహిత పాదయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ తలారి రాణి, కాంగ్రెస్ నాయకులు మిరియాల్‌కార్ శ్రీనివాస్, రాంరెడ్డి, మిరుదొడ్డి భాను, కొమురయ్య, బాల్‌రెడ్డి, నర్సయ్య, అనిత, సిద్దారెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బియ్యం వితరణ

తంగళ్లపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన సారంపల్లి గ్రామం దాసరి పోచయ్య కుటుంబానికి మిత్ర సేన యూత్ సభ్యులు ఆదివారం 25కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు వితరణగా అందించారు. యూత్ అధ్యక్షుడు రంజిత్, ఉపాధ్యక్షులు బాబు, సభ్యులు రాజు, అజయ్, అరవింద్, ఖాదర్, అభిలాష్, శివ తదితరులు పాల్గొన్నారు.అలాగే మాజీ సర్పంచ్ కొయ్యడ రమేష్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి 50 కిలోల బియ్యాన్ని వితరణగా అందించారు. ఆయనతో పాటు గ్రామానికి చెందిన గుగ్గిళ్ల నరహరి, సుంకటి రమేష్, గుండి రాజు తదితరులు ఉన్నారు.

● ముస్తాబాద్ : మండల కేంద్రంలో తలారి భూదయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా 50 కేజీల బియ్యాన్ని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వితరణ చేశారు. కుటుంబానికి అండగా ఉంటామని కాంగ్రెస్ కార్యకర్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ స్వేచ్ఛ, సోషల్ మీడియా కన్వీనర్ ఏదునూరి భానుచందర్, మహిళా మండల అధ్యక్షురాలు అనిత, మామండ్ల అంజనేయులు, తలారి నర్సయ్య, నల్ల బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మిక క్షేత్రాలను పట్టించుకోని మున్సిపల్ అధికారులు

- బీజేపీ పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని కార్మిక క్షేత్రాలను మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో అక్కడి ప్రజలు సమస్యలతోనే జీవనం సాగిస్తున్నారని బీజేపీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని 21వ వార్డు గణేష్‌నగర్‌లో ఆదివారం బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వార్డు ఇన్‌చార్జీలు గాలి లలిత శ్రీనివాస్, సిద్ది దేవరాజ్‌ల సమక్షంలో బీజేపీ జెండాను పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మ్యానరాంప్రసాద్, మోర శ్రీహరి, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కర్నే హరీష, గాజుల సదానందం, రాయిని ప్రతాప్, బాగయ్య తదితరులు పాల్గొన్నారు.